## కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలి

**ఢిల్లీలో వందలాది కళాకారుల ధూంధాం**

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫొటోను కరెన్సీనోట్లపై ముద్రించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో బుధవారం వందలాది కళాకారులు ధూంధాం నిర్వహించారు. కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ ఆధ్వర్యంలో కొనసాగిన ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, బీద మస్తాన్‌రావు, ఎంపీ ఈటల రాజేందర్, కలిశెట్టి అప్పలనాయుడు, డాక్టర్ ఏపూరి సోమన్న, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు, ఆళ్ల రామకృష్ణ, కళాకారులు పొల్లాల వాణి, గంగా తదితరులు పాల్గొన్నారు.

## విభేదాలు వీడాలి.. రిజర్వేషన్ సాధించాలి

**బీసీ ఐక్యకూటమి పిలుపు**

హైదరాబాద్, మార్చి26 (నమస్తే తెలంగాణ): కుల సంఘాలు, బీసీ సంఘాల నేతలు విభేదాలను వీడాలని బీసీ ఐక్య కూటమి కన్వీనర్ దాసు సురేశ్ కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 42 శాతం రిజర్వేషన్ల అమలు, దేశవ్యాప్త కులగణన, చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ల కోసం ఉద్యమించాలని సూచించారు. సమన్వయంతో కదిలితేనే 42 శాతం రిజర్వేషన్ల అమలు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

# జుక్కల్‌లో టెన్త్ పేపర్ లీక్?

- గణితం ప్రశ్నలు తెల్లకాగితంపై బయటకు?
- విధుల్లో నిర్లక్ష్యం వహించిన ముగ్గురిపై వేటు

కామారెడ్డి/బిచ్కుంద, మార్చి 26: పదోతరగతి పరీక్షా కేంద్రం నుంచి గణితం పేపర్ ప్రశ్నలు బయటకు వచ్చాయన్న ప్రచారం కామారెడ్డి జిల్లాలో బుధవారం కలకలం రేపింది. తెల్లకాగితంపై రాసి ఉన్న నాలుగు ప్రశ్నలు సోషల్ మీడియాలో వైరల్ కావడం సంచలనం సృష్టించింది. జుక్కల్ మండలంలో చోటుచేసుకున్న ఈ ఉదంతంపై అధికారులు దర్యాప్తుచేపట్టారు. బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, డీఈవో రాజు పరీక్షా కేంద్రానికి చేరుకుని విచారణ చేపట్టారు. విధుల్లో నిర్లక్ష్యం వహించారని పేర్కొంటూ సీఎస్ సునీల్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ భీమ్, ఇన్విజిలేటర్ దీపికను విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు డీఈవో తెలిపారు. ఎగ్జామ్ సెంటర్‌లో పనిచేసే వారే ప్రశ్నలను బయటకు పంపించారా? ఇందులో ఎవరెవరి ప్రమేయముంది? తదితర అంశాలపై విచారిస్తున్నట్టు తెలిసింది. నీళ్లు అందించే వ్యక్తి ప్రశ్నలు రాసి ఉన్న పేపర్‌ను బయటకు తీసుకొచ్చినట్టు చెప్తున్నారు. మరోవైపు, ఈ ఉదంతంపై డీఈవో రాజు జుక్కల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు సమాచారం. పేపర్ లీక్ కాలేదని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. పరీక్షలు యథావిధిగా జరుగుతాయని, విద్యార్థులెవరూ భయపడకుండా పరీక్షలు రాయాలని అధికారులు సూచించారు. అయితే, ప్రశ్నలు బయటకు ఎలా వచ్చాయన్న దానిపై ఎవరూ నోరు మెదపడంలేదు. ఈ అంశాన్ని పోలీసులే తేలుస్తారని చెప్తున్నారు. ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జుక్కల్ ప్రభుత్వ పాఠశాలలోని పరీక్షా కేంద్రం నుంచి ప్రశ్నలు బయటకు వచ్చాయని సోషల్ మీడియాలో ప్రచారం జరగడంతో విచారణ చేపట్టామని డీఈవో రాజు తెలిపారు. ఆయన్ను 'నమస్తే తెలంగాణ' ఫోన్‌లో సంప్రదించగా.. ప్రశ్నపత్రంలోని కొన్ని ప్రశ్నలు ఒక పేపర్ మీద రాసినట్టు గుర్తించామని అన్నారు. విచారణ పూర్తయ్యాకే అన్ని వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.



జుక్కల్ ప్రభుత్వ పాఠశాలలోని పరీక్షా కేంద్రంలో విచారణ జరుపుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి, డీఈవో రాజు, అధికారులు

## నల్లబెల్లిలో మాస్ కాపీయింగ్

**ఏడుగురు ఇన్విజిలేటర్ల తొలగింపు**

నల్లబెల్లి, మార్చి 26 : టెన్త్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్టు గుర్తించిన డీఈవో ఏడుగురు ఇన్విజిలేటర్లను తొలగించారు. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ జిల్లా నల్లబెల్లి జడ్పీహెచ్‌ఎస్‌తోపాటు కారుణ్యజ్యోతి పాఠశాలను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. జడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం ముగ్గురు ఫ్లయింగ్ స్క్వాడ్స్ వచ్చి విద్యార్థులను చెక్ చేశారు. ఒక విద్యార్థి జేబులో జవాబులకు సంబంధించిన చీటీల కట్ట కనిపించింది. సదరు విద్యార్థిని ఆరా తీసి, బాత్రూమ్‌ను పరిశీలించగా కుప్పలుగా నకలు చీటీలు వెలుగు చూశాయి. దీనిపై స్క్వాడ్స్ డీఈవోకు ఫిర్యాదు చేశారు. స్పందించిన డీఈవో జ్ఞానేశ్వర్ జడ్పీహెచ్‌ఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఏడుగురు ఇన్విజిలేటర్లను తొలగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై ఎంఈవో అనురాధను వివరణ కోరగా డీఈవో ఆదేశాల మేరకు ఇన్విజిలేటర్లను తొలగించి వారి స్థానంలో వేరేవారిని నియమించినట్టు తెలిపారు.

## నిమ్స్‌లో పైసా ఖర్చులేకుండా గుండెమార్పిడి

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 26 (నమస్తే తెలంగాణ): గుండె వ్యాధితో బాధపడుతున్న ఓ యువకుడికి నిమ్స్ వైద్యులు విజయవంతంగా గుండెమార్పిడి చేశారు. వివరాల్లోకి వెళితే.. అనిల్‌కుమార్ (19) 'డైలేటడ్ కార్డియో మయోపతి' అరుదైన గుండెజబ్బుతో బాధపడుతున్నాడు. అమెరికా వైద్యాధికారుల సహకారంతో ఈనెల 7న గుండె మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసి.. బుధవారం డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అమరేశ్వర్‌రావు మాట్లాడుతూ అరుదైన డీసీఎం వ్యాధిగ్రస్తుల్లో గుండె పనితీరు రోజురోజుకూ క్షీణిస్తుందని, అలాంటి రోగులకు గుండె మార్పిడి తప్ప మరో మార్గం లేదని తెలిపారు. కార్పొరేట్‌లో ఈ శస్త్రచికిత్సకు రూ.50లక్షల వరకు ఖర్చవుతుందని, నిమ్స్‌లోని ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా శస్త్రచికిత్స చేసినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్లు అమరేశ్వర్‌రావు, గోపాల్, కళాధర్ బృందాన్ని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప అభినందించారు.

## మూడ్రోజులు దంచికొట్టనున్న ఎండలు

**హైదరాబాద్ వాతావరణశాఖ వెల్లడి**

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): ఆవర్తన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజులు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణశాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. బుధవారం భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా పాల్వంచలో 40.6, ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలో 40.4 కొమ్రంభీం జిల్లా కరిమేర, నిర్మల్ జిల్లా తానూర్‌లో 40.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్టు తెలిపింది. ఆదిలాబాద్, కుమురంభీం, నిర్మల్, నిజామాబాద్, ములుగు జిల్లాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదుకావడంతో ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్టు పేర్కొంది. ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ సూచించింది.














